
LETTERS. ఈయన రకరకాల అంశాలపై ప్రచురించిన విమర్శలు లేఖల రూపంలో కొన్ని వేలదాకా ఉండవచ్చు.

... సంవత్సరం పాటు మైసూరు మహారాజా కాలేజీలో లెక్చరర్‌గా పనిచేసి 1954లో అనంతపురంలో ఉన్న తైలసాంకేతిక పరిశోధనా



ఈ వారం కథ

# కిట్టు

వి.రామకోటేశ్వరరావు

బడికి వెళ్ళే సమయం. పుస్తకాల సంచుల్ని భుజాన తగిలించుకుని వెళ్తున్నారు పిల్లలు. కొంతమందితమ పిల్లల్ని దగ్గరుండి బడికి తీసుకు వెళ్తున్నారు.

చెట్టు క్రింద కూర్చొని చుట్ట కాలుస్తూ వచ్చే పోయే వాళ్ళని పరిశీలిస్తున్న ఈరయ్య తాతకి పిల్లల్ని చూస్తుంటే ముచ్చటేసింది. చూపు సరిగా కనిపించకపోయినా, రోజూ చెట్టుక్రింద కూర్చొని బడికి వెళ్ళే పిల్లల్ని పరిశీలిస్తుంటాడు. పిల్లల్ని చూస్తూ తన కిట్టుకి చదువు చెప్పించలేకపోతున్నందుకు బాధపడుతుంటాడు.

ఆడుకుంటున్న కిట్టువచ్చి ఈరయ్య తాత ఒళ్ళో కూర్చున్నాడు. వాడ్ని చూస్తే ఈరయ్య తాతకి మనసు పిండేసినట్లయింది. కిట్టుకి కట్టుకుంటానికి సరైన బట్టలు లేవు. తొడుక్కున్న చొక్కా, లాగుఅక్కడక్కడ చిరిగి దుమ్ము కొట్టుకొని ఉన్నాయి. తాత వాడి వంక ప్రేమగా చూశాడు. చిరిగిన చొక్కాలో నుండి లోపలికి తోసుకుపోయిన పొట్ట కన్పిస్తుంది. తాత వాడ్ని గుండెల కత్తుకుని కుండలో అన్నం ఉంది. నాయుడుగారిచ్చినచింతపచ్చడేసుకుని అన్నం తిను. అన్నాడు.

తాత ఒళ్ళో నుండి లేచి వెళ్ళి అన్నం పెట్టుకున్నాడు కిట్టు.

ఏ తల్లి కన్న బిడ్డో! సరైన పోషణ లేక బక్క చిక్కి పోయాడు. తాను సరిగ్గా చూసుకోలేకపోతున్నాడు. తాతకు గతమంతా గుర్తొచ్చింది.

• • •

ఆఖరి కిరాయి చూసుకుని రిక్షాని యజమానికి అప్పగించి ఇంటికి తిరిగొస్తున్న ఈరయ్య తాతకు రోడ్డు ప్రక్క ఒంటరిగా కూర్చొని ఏడుస్తూ కన్పించాడు కిట్టు. చుట్టూ చూస్తే జనం ఎవరూ కనిపించలేదు. వాడ్ని అలా వదిలిపెట్టబుద్ధి కాలేదు ఈరయ్య తాతకి ఏడుస్తున్న వాడ్ని భుజానికెత్తుకుని ఇంటికొచ్చాడు.

భుజాన బిడ్డతో ఇంటికొచ్చిన ఈరయ్య తాతనుఆశ్చర్యంగా చూసింది భార్య సత్తెమ్మ.

"ఎవరయ్యా, బిడ్డ?" అంది సత్తెమ్మ. జరిగిందంతా చెప్పాడు తాత.

పసిబిడ్డను రోడ్డుమీద వదిలి వెళ్ళిన వాళ్ళని నోటికొచ్చినట్టు తిట్టింది సత్తెమ్మ. కిట్టుని తీసుకుని అన్నం కలిపి తినిపించింది. వాడికి శోలపాటే నిద్ర పట్టింది. ఆ రోజు నుండి సత్తెమ్మలో ఏదో తెలియని ఆనందం. పిల్లలు లేని తనకు భగవంతుడే కిట్టునిచ్చాడని ఆమెకు అనిపించింది. కిట్టుని కన్నకొడుకులాగా పెంచింది. వాడికేకష్టం రాకుండా చూసుకుంది. ఎప్పుడూ అనారోగ్యంతో బాధపడే సత్తెమ్మలో వచ్చిన మార్పుకి సంతోషించాడు ఈరయ్య తాత.

కాని, ఓరోజు సత్తెమ్మ తిరుగుతూనే ఉన్నట్టుండి కన్నుమూసింది.

చావంటే ఏమిటో తెలీని వయస్సు కిట్టుది. తనను అల్లారు ముద్దుగా పెంచే తల్లి ఇకలేదన్న సంగతి పసిహృదయానికి ముందుగా తెలియలేదు. తెలిసిన తర్వాత ఏడ్చాడు. వెక్కి వెక్కి ఏడ్చాడు. వాడిని ఆపటం ఎవరి తరం కాలేదు.

భార్యపోయిన తరువాత ఏం చెయ్యాలో తోచలేదు ఈరయ్య తాతకి. కిట్టు ఆలనా, పాలనా చూసుకోవటం కష్టమై పోయింది. అయినా ఎలాగో లాక్కొచ్చాడు.

ఈరయ్య తాత వయస్సు పెరుగుతుండటంతో శక్తి క్షీణించింది. పనిచెయ్యటానికి ఒళ్ళు సహకరించటంలేదు. పని లేక తిండికి కూడా కష్టంగా ఉంది. కిట్టుని ఏదన్నా పనిలో పెట్టాలనుకున్నాడు. హోటల్ పనిలో అయితే కనీసం వాడన్నాకడుపునిండా తింటాడని ఊళ్ళో ఉన్న హోటల్‌యజమానిని అడిగాడు.

ఆ యజమాని 'చూద్దాం' అన్నాడు. కానీ ఏ సంగతీ చెప్పలేదు.

"ఏంటితాతా, అట్టాఉన్నావ్...?" అన్న కిట్టు పిలుపుతో. ఈ లోకంలో కొచ్చాడు ఈరయ్యతాత.

"ఏంలేదురా,అన్నం తిన్నావా"....

"ఓ..."

"నేను సెంటర్ దాకా వెళ్ళొస్తా. ఇల్లు చూసుకో" అని తుండు భుజం మీద వేసుకుని కర్రతీసుకుని వెళ్ళాడు ఈరయ్యతాత.

• • •

నాలుగురోజులతరువాత హోటల్లో పనికి చేరాడు కిట్టు. మొదట్లో పని కష్టం అనిపించినా పోను పోను అలవాటయిపోయింది. చెప్పిన ప్రతి పనిని చురుగ్గా చేసుకు పోతున్నాడు కిట్టు. ఈ పనులన్నీ చేయలేడని మొదట్లో అనుకున్న యజమాని వాడి చలాకీ తనానికి ముచ్చటపడ్డాడు.

పని చేస్తూనే మధ్య మధ్యలో హోటల్ ప్రక్కనే బొమ్మలమ్ముకునే వాడితో కబుర్లు చెప్పేవాడు. కిట్టు ఆ బొమ్మల్ని పరిశీలనగా చూస్తుండేవాడు.

ఒక రోజు కబుర్లు చెప్తూ బొమ్మల్ని పరిశీలిస్తున్న కిట్టుకివాటిలో ఒక బొమ్మ నచ్చింది.

బిడ్డను ఒళ్ళో పెట్టుకుని పాలిస్తున్న తల్లి బొమ్మ అది. చక్కగా ఉంది అనుకున్నాడు. కన్న తల్లెవరో తెలియని కిట్టుకి తల్లి కనిపించింది బొమ్మలో. కొన్నాళ్ళపాటు తల్లిలా ప్రేమగా పెంచిన సత్తెమ్మ తల్లిని చూసుకున్నాడా బొమ్మలో. బొమ్మను కొనాలనుకున్నాడు.

"బొమ్మెంత?" అడిగాడు కిట్టు. బొమ్మని చూపిస్తూ.

ఆకతాయి కబుర్లు చెప్పేకిట్టు బొమ్మ ఖరీదడుగుతుంటే "అది నువ్వేం చేసుకుంటావ్" అన్నట్టు చూశాడు బొమ్మలోడు. సమాధానం చెప్పలేదు.

"బొమ్మెంత?" మళ్ళీ అడిగాడు కిట్టు.

కిట్టుని చిరాగ్గా చూసి చెప్పాడు ఖరీదు.

చాలా ఎక్కువే అనుకున్నాడు కిట్టు. ఒక మారు జేబు తడుముకున్నాడు. జేబులో డబ్బుల్లేవు. కిట్టు లోనికెళ్ళి పని చేస్తున్నాడే కాని వాడి మనసు ఆగటంలేదు. లోపలి నుండే తొంగి చూశాడు. బొమ్మలోడు అమ్ముకుంటూ కనిపించాడు.

కిట్టు తనస్నేహితుడ్ని అప్పు అడిగాడు. అతను తనదగ్గర డబ్బుల్లేవన్నాడు. ఇంకొకడినడిగాడు. వాడూ లేవన్నాడు. పని చేస్తున్నాడే కానీ వాడి మనసంతా బొమ్మమీదే ఉంది. పనిమీద శ్రద్ధ తగ్గినందుకు యజమాని కసిరాడు.

ఇంటికెళ్ళినా అదే ఆలోచన. నిద్ర పోతూ ఆ బొమ్మనేకలవరిస్తూ ఉలిక్కి పడి లేచాడు.

ఏంటి నాన్నా. కలవరిస్తున్నావు..? అన్నాడు ఈరయ్య తాత.

"బొమ్మ తాతా. అమ్మబొమ్మ. పొద్దున చూశా, చాలా బాగుంది. అచ్చం అమ్మలాగే ఉంది. అదికొనుక్కోవాలి తాతా".... అన్నాడు కిట్టు.

తల్లి ప్రేమకోసం కిట్టు ఎంత తపిస్తున్నాడో తెలిసి బాధనిపించింది ఈరయ్య తాతకి. కిట్టు చెప్పే బొమ్మకు సరిపడా డబ్బులు కూడా తను ఇవ్వలేనందుకు బాధపడ్డాడు.

ఆ రోజు నుండి రాత్రి పగలు కష్టపడి పనిచేశాడు కిట్టు. హోటల్ పని



పూర్తవగానే నాలుగిళ్ళల్లోనీళ్ళు మోశాడు. వచ్చిన ప్రతిపైసా జాగ్రత్తగా మూటకట్టి దాచుకున్నాడు. బొమ్మకు సరిపడా డబ్బులు ప్రోగు చేశాడు. ఆ మూటను గుండెలకు హత్తుకుని తృప్తిగా గాలి పీల్చుకున్నాడు. వాడి మనసులో ఆ బొమ్మ నవ్వుతున్నట్లు. తనను లాలిస్తున్నట్లు అనిపించింది.

వేసవికాలం చిరుఎండమీద పడటంతో మెలకువవచ్చింది కిట్టుకి. లేచి తయారయ్యి. డబ్బుల మూటను చూసుకుని ఆనందించాడు. ఆమూటను జేబులో పెట్టుకుని పనికెళ్ళాడు.

కిట్టు పని చేస్తున్నాడే కానీ వాడి మనసంతా బొమ్మలోడు ఎప్పుడొస్తాడా. బొమ్మ ఎప్పుడు సొంతం చేసుకుందామా అని తొందరగా ఉంది. రోజూ ఈ సమయానికి వచ్చే బొమ్మలోడు ఈ రోజు ఇంకా రానందుకు మనసులోనే తిట్టుకున్నాడు.

కాసేపటికి వచ్చాడు బొమ్మలోడు. తెచ్చిన బొమ్మలన్నీ వరుసగా పేర్చాడు. కిట్టు వెళ్ళి ఆ బొమ్మ తీసుకున్నాడు. బొమ్మను గుండెల కానించుకుని ఆనం

